క్లుప్తంగా

పనులు మొదలు పెట్టిన వెంటనే బిల్లులు

అమడగూరు: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను వేగవంతంగా నిర్మించాలని ఎంపీడీఓ నసీమా సూచించారు. లబ్ధిదారులకు శనివారం ఆమె పలు సూచనలు చేశారు. హౌసింగ్ అధికారులు వేయించిన కొలతల ప్రకారం నిర్మాణాలను చేసుకోవాలన్నారు. బేస్‌మెంట్ పూర్తయిన వెంటనే అధికారులకు తెలియజేస్తే బిల్లు చెల్లిస్తారని, తర్వాత గోడల నిర్మాణం పూర్తికాగానే మరొక బిల్లు, చివరగా మౌల్డింగ్ పూర్తి కాగానే బిల్లు ఇస్తారని తెలిపారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకూ సుమారు 400 నూతన గృహాలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

గోపాలమిత్రపై చర్యలు తీసుకోండి

కనగానపల్లి: పశువైద్యశాలకు వచ్చిన పాడి రైతుపై దురుసుగా ప్రవర్తించిన గోపాలమిత్ర రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని కనగానపల్లి గ్రామస్తులు వెటర్నరీ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. కనగానపల్లికి చెందిన పాడి రైతు నాగమునీంద్ర తన ఆవుకు వైద్య చేయించేందుకు స్థానిక వైద్యశాల వద్దకు వెళ్లాడు. అక్కడ గోపాలమిత్ర అతనిపై దురుసుగా ప్రవర్తించి, చేయిచేసుకున్నాడని స్థానిక పాడిరైతులు తెలిపారు. ధర్మవరం డీడీఏ వీరభద్రయ్య ఆదేశాల మేరకు గోపాలమిత్ర రామాంజనేయులును ఆస్పత్రి విధుల నుంచి తొలగించినట్లు వెటర్నరీ డాక్టర్ మన్‌మోహన్ తెలిపారు.

హార్మోనిస్టు నారాయణ స్వామికి సన్మానం



నారాయణస్వామి దంపతులకు సన్మానం

ధర్మవరం: ఆరు దశాబ్దాలుగా హార్మోనిస్టుగా, ఆధ్యాత్మిక గురువుగా సేవలు అందిస్తున్న అనంతపురం జిల్లా నార్పల మండలం బి.పప్పూరు గ్రామానికి చెందిన మాల్యవంతం నారాయణస్వామికి డాక్టరేట్ రావడం హర్షణీయమని పలువురు కొనియాడారు. మండలంలోని తుంపర్తి గ్రామంలో శనివారం నారాయణస్వామి దంపతులను శాలువాలు, పూలమాలలతో కళాకారులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ రామకృష్ణగౌడ్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఫౌండర్ ఆకుల రమేష్ నారాయణస్వామికి డాక్టరేట్ ప్రదానం చేశారు.

పండిట్ దీనదయాళ్ గొప్ప మానవతా వాది



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పుట్టపర్తిటౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలు అమోఘమని వక్తలు అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా పుట్టపర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్థసారథి, జ్యోతి ప్రసాద్, హరికృష్ణ, కత్తి రాజారెడ్డి, బాలగంగాధర్, సునీల్‌వైట్ల, కొండమరాజు, నారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన జాఫర్, అతని భార్య షకీనా ద్విచక్ర వాహనంపై ధర్మవరం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ముక్తాపురం వద్దకు రాగానే వాహనం నుంచి అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారి ఇద్దరినీ హైవే పెట్రోలింగ్ వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

భయం వీడితే విజయం మీదే

బత్తలపల్లి: భయాన్ని వీడి ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివితే పరీక్షల్లో విజయం ఖాయమని డైట్ కళాశాల లెక్చరర్ సురేష్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్షల సమయంలో ఆందోళన, ఒత్తిడి ఉంటుందని, అయితే మానసికంగా దృఢత్వంతో ఉంటే వాటిని అధిగమించి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ బెళుగుప్ప నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుని తడక మహోత్సవం





అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, స్వామివారికి తడక కప్పుతున్న పూజారులు



కొండపై పోటెత్తిన జనం(ఇన్‌సెట్‌లో) చెన్నకేశవస్వామి

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిధిలోని చంద్రాయునిపల్లి సమీపంలో కొండలో వెలసిన చెన్నకేశవ స్వామి తడక మహోత్సవాన్ని శనివారం వేలాది మంది భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి తరుగు వంశీయుల ఆధ్వర్యంలో పూజారులు తడక మహోత్సవం నిర్వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. తరుగు వంశీయులు,ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులకు తరుగు వంశీయులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కొండపైకి రహదారిని నిర్మించడంతో జిల్లాతోపాటు పొరుగు జిల్లాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి లోటు లేకుండా సదుపాయాలు కల్పించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

- ధర్మవరం నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు 9506
- ఉపాధ్యాయ ఓటర్లు 612



మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

ధర్మవరం అర్బన్: ధర్మవరం నియోజకవర్గంలోని ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం వివరాలు వెల్లడించారు. ధర్మవరం అర్బన్, రూరల్, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో పట్టభద్రుల ఓట్లు పురుషులు, స్త్రీలు కలిపి 9506 మంది ఓటర్లు, ఉపాధ్యాయులకు సంబంధించి పురుషులు, స్త్రీలు కలిపి 612 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 16న నోటిఫికేషన్, మార్చి 13న పోలింగ్, మార్చి 16న కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఉప ఎన్నికల తహసీల్దార్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



ఆలయానికి కలశంతో వస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సీతారాముల విగ్రహాలను ప్రతిష్టించిన దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని దామానుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. వేద పండితుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట , ధ్వజ స్తంభప్రతిష్ట, కలశ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు ఐకమత్యంతో రామాలయం నిర్మించడం గొప్పవిషయమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణ రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, ఓబిరెడ్డి, కృష్ణారెడ్డి, రమణా రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

నయనమనోహరం.. గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్‌లో నూతనంగా నిర్మించిన శీతలాదేవి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రతిష్టించనున్న విగ్రహాలకు శనివారం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, ప్రతిష్టా దేవతల మూలమంత్ర హోమాలు, దీక్షా హోమం, పుష్పాది వాసాంగ హోమం, సంపాతాజ్యం, కళా హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్టించనున్న విగ్రహాలను పూలపల్లకిలో ఉంచి గ్రామోత్సవం చేశారు. 12న విగ్రహ ప్రతిష్టాపనమహోత్సవం ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సాకే చిన్నక్రిష్ణ, బెస్త రామక్రిష్ణ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి శ్రమించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: మార్చి13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు దారుల విజయానికి నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి సూచించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో కదిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, వీసీఏ స్‌ఆర్‌ఐ విద్యాసంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథ్ రెడ్డితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి స్థానానికి వెన్నపూస రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయ శాసనమండలి స్థానానికి ఎంవీ రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్నారన్నారు. సీఎం జగనన్న ఆదేశాలమేరకు వీరిద్దరి విజయానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి ఎన్నికల ప్రచారం చేపట్టాలన్నారు.

ఆటో బోల్తా..డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

బత్తలపల్లి: ఆటో బోల్తా పడి డ్రైవర్ గాయపడిన ఘటన అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని రామాపురం సమీపంలో శనివారం చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. డీ చెర్లోపల్లికి చెందిన వెంకటప్ప ఆటో నడిపి జీవిస్తున్నాడు. శనివారం బత్తలపల్లి నుంచి ఖాళీ ఆటోను డీ చెర్లోపల్లికి తీసుకెళ్తుండగా రామాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి బోల్తా పడింది. వెంకటప్ప కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే తోపుదుర్తి అండ



ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తరఫున బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

కనగానపల్లి (రామగిరి): రామగిరి మండలంలోని పెద్ద కొండాపురం, రెడ్డివారిపల్లి, మక్కినవారిపల్లి గ్రామాల్లోని బాధితులు సిద్దక్క, అంజినమ్మ, బాబు, జ్యోతి, అక్కమ్మ, ఓబులేసు కుటుంబాలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. పెద్దకొండాపురం పంచాయతీలో ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు కొందరు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వెళ్లి ఎమ్మెల్యే ఇచ్చిన రూ.3లక్షలను బాధిత కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయ కరెన్న, జెడ్పీటీసీ సభ్యుడు నాగార్జున, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, మాజీ ఎంపీపీ సుజాత భర్త ఆదిరెడ్డి, సర్పంచ్‌లు రామ్మూర్తి, రాజేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 490 కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

కదిరి టౌన్: రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కదిరి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 490 కేసులు పరిష్కరించినట్లు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు తెలిపారు. కక్షిదారులను రాజీచేసి కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కేసులను సత్వరం పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందన్నారు.

మారిన గ్రామీణ రహదారుల రూపురేఖలు

- తారు రోడ్ల నిర్మాణంతో మెరుగైన రవాణా సదుపాయాలు
- రూ.1.70కోట్లతో గొడ్డువెలగల–తుమ్మలబైలు రోడ్డు పనులు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



నిర్మాణం పూర్తయిన గొడ్డువెలగల -తుమ్మలబైలు తారు రోడ్డు

గాండ్లపెంట: టీడీపీ హయాంలో గ్రామీణ రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉండేది. రాళ్లు, రప్పలు, గుంతలతో రోడ్లు దర్శనం ఇచ్చేవి. పల్లెలనుంచి పట్టణాలకు వెళ్లే క్రమంలో వాహనదారులు, పాదచారులు గుంతల్లో పడుతూ లేస్తూ గమ్యానికి చేరుకునేవారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామీణ రోడ్ల ముఖ చిత్రం మారిపోయింది. మట్టి రోడ్ల స్థానంలో తారు రోడ్లు వెలుస్తున్నాయి. ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు విడుదల చేసి రోడ్లను అభివృద్ధి చేస్తోంది. అందులో భాగంగా మండలంలోని గొడ్డువెలగల నుంచి తుమ్మలబైలు వరకు చేపట్టిన తారు రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుమ్మలబైలు తండా, సాదులవాండ్లపల్లి, తుమ్మలబైలు గ్రామస్తులు కదిరి పట్టణానికి వెళ్లాలంటే కటారుపల్లి క్రాస్ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. అదే విధంగా గొడ్డువెలగల గ్రామస్తులు మండల కేంద్రమైన గాండ్లపెంటకు రావాలంటే ఆ గ్రామం నుంచి కదిరికి, కదిరి నుంచి గాండ్లపెంటకు దాదాపు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ప్రభుత్వంతో చర్చించి రూ.1.70 కోట్ల నిధులు మంజూరు చేయించి గొడ్డువెలగల నుంచి తుమ్మలబైలు వరకు మూడు కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. ప్రస్తుతం గొడ్డువెలగల నుంచి తుమ్మలబైలు మీదుగా 15 కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి సులభంగా చేరుకునేలా రోడ్డు నిర్మించారు. దీంతో సగాని సగం దూరం తగ్గడంతో పాటు గ్రామీణులకు వ్యయ ప్రయాసలు తగ్గాయి.

ఖాద్రీశుని ఆలయం కిటకిట



భక్తులతో కిటకిటలాడుతున్న ఖాద్రీ ఆలయం

కదిరి టౌన్: మాఘమాసాన్ని పురస్కరించుకొని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి విశేష అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటకతోపాటు చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి,అన్నదానం చేసింది.

సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కృష్ణారెడ్డి

ధర్మవరం అర్బన్: వైద్య, ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో శనివారం ధర్మవరం డివిజన్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్య సిబ్బందితో సమావేశమై హెల్త్ కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. ప్రజలకు సకాలంలో వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణయ్య, ధర్మవరం డివిజన్ అదనపు వైద్యాధికారి సెల్వియా సాల్మన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను తెలుసుకుందాం

- స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి



స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలను వీక్షిస్తున్న కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులకు దేశ ప్రజలు రుణపడి ఉంటారని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఉర్దూ మున్సిపల్ స్కూల్‌లో జమాతే ఇస్లామి హింద్, ఈ న్యూస్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమయోధుల చిత్రపటాల ప్రదర్శనను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దేశంపై ప్రతి ఒక్కరూ అభిమానం, ప్రేమ కలిగి ఉండాలని సూచించారు. జాతిపిత మహాత్మాగాంధీ పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం, ఖాదీ ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లిన స్వాతంత్య్ర సమరయోధుల్లో తెలుగువారు ఎంతో మంది ఉన్నారన్నారు. అలాంటి మహనీయుల జీవితాలను విద్యార్థులు, ప్రజలు తెలుసుకోవాలన్నారు. విప్లవం నా జన్మహక్కు...అని చాటి చెప్పిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని గుర్తు చేశారు. కాగా ఈ ప్రదర్శన రెండు రోజులపాటు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కల్యాణ మండపం ప్రారంభం

కదిరి మండలం వీరేపల్లిపేటలో వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో చలంశెట్టి రామక్రిష్ణ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే డా.పీవీ పీవీ సిద్దారెడ్డి శనివారం ప్రారంభించారు. ఎంపీపీ తోట అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ చలపతినాయక్, సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఆ నలుగురూ ఆత్మబంధువులు

- అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు



బాలన్ మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: భక్తి మార్గంలో పయనిస్తూ పుట్టపర్తికి విచ్చేసి ప్రాణాలు వదిలిన అనాథ వృద్ధుడికి పుట్టపర్తిలోని ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ సొసైటీ సభ్యులు ఆత్మబంధువులుగా మారి అంత్యక్రియలు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన బాలన్ (87) కొద్ది సంవత్సరాల క్రితం సత్యసాయి భక్తుడుగా పుట్టపర్తికి విచ్చేసి గోపురం 2వ క్రాస్‌లో నివాసం ఉంటున్నారు. అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనాథ శవంగా గుర్తించి ఖిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సభ్యులు షామీర్, అలీ, చాంద్, షాకీర్, నవాజ్ వెళ్లి బాలన్‌కు హిందూ సంప్రదాయం ప్రకారం కర్నాటకనాగేపల్లి వద్ద ఉన్న క్రిమిటోరియంలో అంత్యక్రియలు నిర్వహించారు.